సాక్షి అనంతపురం

శనివారం : 8 : జూన్ : 2024



చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి.



నకిలీ విత్తనాలతో జాగ్రత్త !

ఖరీఫ్ సాగుకు సిద్ధమైన రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
34.3°/22.8°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

విద్యుత్ కనెక్షన్లలో రికార్డ్

- ఎదురుచూపులకు చెక్
- గతంలో ఏళ్ల తరబడి వెయిటింగ్
- నేడు మూడు నెలల్లోపే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్
- తగినన్ని సబ్‌స్టేషన్లతో విద్యుత్ హెచ్చుతగ్గుల కట్టడి



సాక్షి ప్రతినిధి, అనంతపురం : వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో ఉమ్మడి అనంతపురం జిల్లా ముందు వరుసలో ఉంది. గడిచిన ఐదేళ్లలో దాదాపు 73 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినట్టు ఎస్పీడీసీఎల్ పరిశీలనలో వెల్లడైంది. ఇది ఆల్‌టైమ్ రికార్డుగా నిలిచింది. 2014–19 మధ్య కాలంలో 26 వేల విద్యుత్ కనెక్షన్లు మాత్రమే ఇచ్చారు. తర్వాత ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ పోటాపోటీగా విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశారు. 2014కు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏడాదికి లక్ష కనెక్షన్లు మాత్రమే ఇచ్చారు. ఐదేళ్లలో 3.50 లక్షల కనెక్షన్లు ఉండేవి. ఇప్పుడు ఒక్క అనంతపురం జిల్లాలోనే 73 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం ఆషామాషీ విషయం కాదని విద్యుత్ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

దరఖాస్తు చేసుకున్న మూడు నెలలోపే..

ఒకప్పుడు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ఏళ్ల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. దరఖాస్తు చేసుకున్న రెండేళ్ల తర్వాతే రైతుకు అవకాశం వచ్చేది. ఇప్పుడది మూడు నెలలకు తగ్గింది. గడిచిన ఐదేళ్లలో భారీ స్థాయిలో కనెక్షన్లు ఇవ్వడంతో పెండింగ్ కనెక్షన్ల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఒక్కో సర్వీసుకు ప్రభుత్వానికి రూ.37 వేల వరకూ వ్యయమవుతుంది. రైతు నుంచి రూ.14 వేలు మాత్రమే తీసుకుని కనెక్షన్ ఇస్తారు. ఇలా గడిచిన ఐదేళ్లలో వ్యవసాయ విద్యుత్ కోసం అక్షరాలా రూ.270 కోట్లు ప్రభుత్వం వ్యయం చేసింది.

రికార్డు స్థాయిలో సబ్‌స్టేషన్లు

దేశంలోనే అత్యధికంగా ఒక్క జిల్లాలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు 42 ఏర్పాటు చేయడం ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే జరిగింది. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులను నియంత్రించేందుకు ఈ సబ్‌స్టేషన్లు కీలకంగా పనిచేస్తాయి. దాదాపు 90 శాతం సబ్‌స్టేషన్లు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. మిగతా 10 శాతం సబ్‌స్టేషన్లు కూడా ఈ నెలాఖరుకు పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో రైతులకు నాణ్యమైన విద్యుత్ అందుతుంది. ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోవడం వంటివి జరగవు. విద్యుత్ సరఫరాలో ఉండే అంతరాయాల వల్ల గతంలో మోటార్లు, స్టార్టర్లు కూడా కాలిపోయేవి. ఇప్పుడు అలా కాలిపోవడానికి అవకాశమే లేదు.

తగ్గిన విద్యుత్ వినియోగం

గత కొద్ది రోజులుగా విద్యుత్ వినియోగం తగ్గింది. ఒక దశలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రోజుకు 21 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడకం ఉండేది. ఇప్పుడది 15వేల యూనిట్లకు వచ్చినట్టు తేలింది.

అనంతపురం పార్లమెంట్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు
1,67,407

హిందూపురం పార్లమెంట్ పరిధిలో..
1,43,798

మొత్తం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు
3,11,205

గృహ, ఇతర కనెక్షన్లు (రెండు జిల్లాల్లో కలిపి)
13,02,572

కొన్ని రోజుల క్రితం వరకు తీవ్ర ఎండల కారణంగా ఏసీలు, కూలర్లు భారీగా వాడటంతో అమాంతంగా విద్యుత్ వినియోగం పెరిగింది. ఇప్పుడు వర్షాలు పడటం, వాతావరణం కాస్త చల్లబడటంతో విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గింది.

విస్తారంగా వర్షాలు

- గుమ్మఘట్టలో 89.2 మి.మీ భారీ వర్షం

అనంతపురం అగ్రికల్చర్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లా అంతటా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 23 మండలాల పరిధిలో 16.2 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అందులో గుమ్మఘట్ట మండలంలో 89.2 మి.మీ భారీ వర్షం కురిసింది. శెట్టూరు 51.2 మి.మీ, యల్లనూరు 45.8, రాయదుర్గం 45.6, కంబదూరు 43.4, రాప్తాడు 24.6, బెళుగుప్ప 24.2, బొమ్మనహాళ్ 20, ఆత్మకూరు 20 మి.మీ, డి.హిరేహాళ్ 18, కళ్యాణదుర్గం 17.4, కూడేరు 16.2, కణేకల్లు 16, అనంతపురం 15.4, బ్రహ్మసముద్రం 15.2, గుంతకల్లు 13.2 మి.మీ వర్షం కురిసింది. మిగతా మండలాల్లో తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి.

సాగు మొదలు

జూన్‌లో సాధారణ వర్షపాతం 61 మి.మీ కాగా మొదటి వారంలోనే 82 మి.మీ నమోదు కావడం విశేషం. కాగా శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పలు మండలాల్లో ఉరుములతో కూడిన మోస్తరుగా వర్షపాతం నమోదైంది. జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు పడుతుంటంతో రైతులు పంటల సాగు మొదలు పెట్టారు. ఈ నెల 15 తర్వాత నుంచి జూలై నెలంతా ఖరీఫ్ సాగుకు మంచి అదనుగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

జిల్లాకు వర్ష సూచన

రాగల మూడు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి శుక్రవారం విడుదల చేసిన



అనంతపురంలో వర్షం కురుస్తున్న దృశ్యం

ప్రాజెక్టులకు జలకళ

బొమ్మనహాళ్: ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులు జలకళ సంతరించుకుంటున్నాయి. తుంగభద్ర జలాశయానికి బుధవారం 517, గురువారం 1,581 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో డ్యాం పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో శుక్రవారం ఉదయానికి 2,190 క్యూసెక్కులకు పెరిగింది. డ్యాంలో ప్రసుతం 1,578.57 అడుగుల నీటి మట్టం ఉండగా 3.820 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రాయబసవన కాలువకు 6 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

బీటీపీకి చేరుతున్న వరదనీరు

గుమ్మఘట్ట: రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాలకు వరప్రదాయినిగా ఉన్న భైరవానితిప్ప ప్రాజెక్టు(బీటీపీ)కి వరద నీరు చేరుతోంది. ఎగువన కర్ణాటకలో వర్షాలు కురుస్తుండడంతో



తుంగభద్ర జలాశయం

1644.3 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. ఆయకట్టు రైతుల్లో నూతనోత్సాహం నెలకొంది. సాగునీటి కాలువల పునరుద్ధరణ పనులకు జలవనరులశాఖ అధికారులు ముందస్తుగా తగిన ప్రణాళికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందించాలని కుడి, ఎడమ కాలవల ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఆగని విధ్వంసం.. అరాచకం



కణేకల్లు మండలం కళేకుర్తి సచివాలయం వద్ద నవరత్నాల లోగో ధ్వంసం చేస్తున్న దృశ్యం



సలకంచెర్వులో సచివాలయ బోర్డును పగులగొడుతున్న టీడీపీ కార్యకర్తలు

- ప్రభుత్వ భవనాలపై టీడీపీ కార్యకర్తల దాడులు
- శిలాఫలకాలు, బోర్డులు పగులగొడుతున్న వైనం

కణేకల్లు/శింగనమల/ యాడికి: సాధారణ ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు తెగబడుతూనే ప్రభుత్వ భవనాలపై ఉన్న శిలాఫలకాలు, బోర్డుల ధ్వంసాలకు పాల్పడుతున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసు ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నా అధికార టీడీపీ కార్యకర్తలు బేఖాతరు చేస్తున్నారు. మూకుమ్మడిగా వెళ్లడం.. గత ప్రభుత్వ బోర్డులు, శిలాఫలకాలను కసితీరా ధ్వంసం చేయడం ద్వారా పైశాచికత్వాన్ని ప్రదర్శించినట్లవుతోంది. ఈ క్రమంలో ఎవరైనా అడ్డుచెప్పినా బెదిరింపులకు దిగడం, భయాందోళనకు గురిచేయడం చేస్తున్నారు. దాడుల్లో కొన్ని పట్టపగలే జరుగుతుండగా.. మరికొన్ని రాత్రిపూట గుట్టుగానూ సాగుతున్నాయి. శుక్రవారం కణేకల్లు మండలం కళేకుర్తిలో గ్రామ సచివాలయం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, రైతుభరోసా కేంద్రం భవనాల వద్దకు టీడీపీ కార్యకర్తలు చేరుకుని నవరత్నాల లోగోతో కూడిన బోర్డులను, మాజీ సీఎం ఫొటోలను సుత్తితో పగులగొట్టారు. ఇదిలా ఉండగా గురువారం రాత్రి జక్కలవడికి ఆర్బీకే భవనం వద్ద ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఇదే రోజు రాత్రి శింగనమల మండలం లోలూరు సచివాలయం(ఆకులేడు-2) వద్ద నవరత్నాల బోర్డును ముక్కలు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం సలకంచెర్వు గ్రామంలో టీడీపీ నాయకులు బయ్యన్న, తిరుపాలు, కార్యకర్తలు సచివాలయ ప్రారంభోత్సవ శిలాఫలకం, నవరత్నాల బోర్డు, రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే) బోర్డులను ధ్వంసం చేశారు. యాడికి మండలం వేములపాడు వద్దనున్న రైతుభరోసా కేంద్రం ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని గురువారం రాత్రి టీడీపీ శ్రేణులు పగులగొట్టాయి.

వాహనం ధ్వంసం



ధ్వంసమైన స్కార్పియో వాహనం

బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రం పంచాయతీలోని హమాలీ కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శేషానందరెడ్డికి చెందిన స్కార్పియో వాహనాన్ని గురువారం రాత్రి గాయత్రి కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్తలు శ్రీనివాసులు, వాసు మరో ఆరుగురు కలిసి కట్టెలు, రాళ్లతో ధ్వంసం చేశారు. దాడి సమయంలో శేషానందరెడ్డి లేకపోవడంతో ఆయన భార్య సరస్వతిని బెదిరించి వాహనాల్లో వెళ్లిపోయారు. అనంతరం బాధితుడు శేషానందరెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

న్యూస్‌రీల్

అనంతపురం జట్టు విజయం



మచ్చా దత్తారెడ్డి

అనంతపురం: ఆంధ్ర సీనియర్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మెన్ సీనియర్ -20 అంతర్ జిల్లా క్రికెట్ మ్యాచ్‌లో అనంతపురం జట్టు విజయం సాధించింది. శుక్రవారం అనంతపురం, నెల్లూరు జట్లు తలబడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంపిక చేసుకున్న అనంతపురం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 187 పరుగులు సాధించింది. అనంతపురం జట్టు బ్యాటర్ మచ్చా దత్తారెడ్డి అద్భుతమైన బ్యాటింగ్ చేసి 68 పరుగులు (42 బంతుల్లో 5 సిక్సర్లు, 1 ఫోర్) సాధించాడు. వీరారెడ్డి 35 బంతుల్లో (1 సిక్స్, 4 ఫోర్లు) 45 పరుగులు, గిరినాథరెడ్డి 17 బంతుల్లో (2 సిక్సర్లు, 1 ఫోర్) 26 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 188 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో విఫలమైంది. 17.1 ఓవర్లలో 129 పరుగులకు ఆలౌట్ అయింది. 58 పరుగుల తేడాతో అనంతపురం జట్టు ఘన విజయం సాధించింది. అనంతపురం బౌలర్లు మల్లికార్జున 5 వికెట్లు, సంతోష్ 3 వికెట్లు, దీపక్‌రాజ్ కుళ్లాయప్ప చెరో వికెట్ తీసుకున్నారు.

జాతీయ సాహస అవార్డుకు దరఖాస్తులు

అనంతపురం కల్చరల్: టెన్సింగ్ నార్గే జాతీయ సాహస అవార్డు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆన్‌సెట్ సీఈఓ కరుణకుమారి శుక్రవారం తెలిపారు. గతమూడేళ్లలో భూమి, నీరు, గాలి వంటి వాటిపై చేసిన సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారు అవార్డుకు అర్హులని పేర్కొన్నారు. పురస్కారానికి ఎంపికైన వారిని రాష్ట్రపతి చేతుల మీదుగా టెన్సింగ్ నార్గే జాతీయ అవార్డుతో పాటు రూ.15 లక్షల నగదు బహుమతినందించి సత్కరిస్తారని తెలిపారు. ఈ నెల 14 లోపు దరఖాస్తులు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు httprllawardr,gov.inl లో సంప్రదించాలని కోరారు.

ఎస్కేయూ మాజీ వీసీలకు నోటీసులు

అనంతపురం: అధికారిక వాహనాలను వ్యక్తిగత పనులకు వినియోగించినందుకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) మాజీ వీసీలకు నోటీసులు జారీ అయ్యాయి. ఈ మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీసీ అధికార వాహనంలో వ్యక్తిగత పర్యటనలకు వెళ్లినందున ప్రతి కిలో మీటరుకూ మూడు రూపాయలు చొప్పున అద్దె చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. మాజీ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి 2020 నవంబర్ నుంచి 2023 నవంబర్ 26 వరకు వ్యక్తిగత పనుల నిమిత్తం అధికారిక వాహనాల (ఏపీ 02 బీజే 5157, ఏపీ 02 ఏఏ 5566)ను వినియోగించారని, ఇందుకుగాను యూనివర్సిటీ నిబంధనల ప్రకారం ప్రతి కిలో మీటరుకు రూ.3 చొప్పున మొత్తం రూ.5,62,023 అద్దె చెల్లించాలని నోటీసులు తెలిపారు. అదే విధంగా మరో మాజీ వీసీ కె.రాజగోపాల్ వ్యక్తిగత పనుల నిమిత్తం అధికారిక వాహనాన్ని వినియోగించినందుకు రూ.75 వేలు చెల్లించాలని మరో నోటీసు జారీ చేశారు.

10న పెన్షన్ అదాలత్



అనంతపురం సిటీ: ఈపీఎస్ పెన్షనర్లు, సభ్యుల ఫిర్యాదుల పరిష్కారం కోసం ఈ నెల 10న పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు కడప రీజనల్ పీఎఫ్ కమిషనర్-2 గౌరవ్ మహల్వాల్ శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు వెబెక్స్ వేదికగా నిర్వహించే అదాలత్‌లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కింది లింక్‌ను ఉపయోగించుకొని తమ సమస్యలను తెలపవచ్చని సూచించారు. https://meet309.webex.com/meet309/i.php?MTID=m81448a25947b388cc5c3ef3147a9156
మీటింగ్ నంబర్: 2644 014 9581
పాస్‌వర్డ్: xMeD77wbst8

'పద్మ' అవార్డులకు దరఖాస్తులు

అనంతపురం కల్చరల్: భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే 'పద్మ అవార్డు–2025' కోసం నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమాధికారి కరుణ కుమారి ఒక ప్రకటనలో తెలియజేశారు. సదరు అవార్డులకు దరఖాస్తు చేసుకునేవారు కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవలు, సైన్సు, ఇంజనీరింగ్, ప్రజా సంబంధాలు, సివిల్ సర్వీసెస్, ట్రేడ్ , ఇండస్ట్రీ రంగాల్లో విశేష సేవలు చేసి ఉండాలన్నారు. దరఖాస్తుకు రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ https://awards.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణే పరమావధి



వెంగన్నపల్లెలో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమి శాలి

యాడికి: శాంతిభద్రతల పరిరక్షణే పరమావధిగా పోలీసు యంత్రాంగం పనిచేస్తోందని ఎస్పీ గౌతమి శాలి అన్నారు. యాడికి మండలంలో సమస్యాత్మక గ్రామాలైన వెంగన్నపల్లె, పుప్పాలను ఎస్పీ సందర్శించారు. వెంగన్నపల్లెలో పోలీసు పికెట్‌ను తనిఖీ చేశారు. గ్రామాల్లో గొడవలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్పీ వెంట యాడికి అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నాగార్జున రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కేసులు నమోదు చేయండి

గార్లదిన్నె: గ్రామాల్లో గొడవలు, అల్లర్లు చేస్తే కేసులు నమోదు చేయాలని ఎస్పీ గౌతమి శాలి ఆదేశించారు. శుక్రవారం గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే రౌడీషీట్ ఓపెన్ చేయాలన్నారు. పోలీసులు ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటించి శాంతిభద్రతలు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

తాడిపత్రి: ఫ్యాక్షన్ గ్రామమైన వీరాపురాన్ని శుక్రవారం రాత్రి ఎస్పీ గౌతమి శాలి సందర్శించారు. డీఎస్పీ జనార్దన్‌నాయుడు, సీఐ లక్ష్మీకాంతరెడ్డితో కలసి గ్రామంలోని పోలీస్ పికెట్‌ను పరిశీలించారు. సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూసే బాధ్యత మీపైనే ఉందని ఎస్పీ సూచనలు చేశారు.

ముళ్ల పొదలు తొలగించండి

- జీడిపల్లి రిజర్వాయర్ పరిశీలనలో కలెక్టర్
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- జీడిపల్లి గ్రామానికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వివరాలపై ఆరా
- కలెక్టర్ వి.వినోద్‌కుమార్



జీడిపల్లి రిజర్వాయర్ మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బెళుగుప్ప: రిజర్వాయర్ కట్ట వద్ద ముళ్లపొదలను తొలగించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జీడిపల్లి రిజర్వాయర్‌ను ఆర్డీఓ రాణీ సుస్మిత, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ దేశేనాయక్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ప్రధానంగా రిజర్వాయర్ పంపుహౌస్, హెడ్ రెగ్యులేటర్, తూము, కట్టలను పరిశీలించి కట్టకు ఉన్న ముళ్ల పొదలను వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు. రిజర్వాయర్ స్థితిగతులను ప్రాజెక్టు ఎస్ఈ మ్యాపు ద్వారా వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం సాధారణానికి మించి వర్షపాతం నమోదైందని, రిజర్వాయర్లకు ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో సమయాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని చెప్పారు. జీడిపల్లి రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 1.58 టీఎంసీ కాగా.. ప్రస్తుతం 0.30 టీఎంసీ మాత్రమే నిలువ ఉందన్నారు. వర్షాలకు 150 క్యూసెక్కుల వరకు వాగులు, వంకల ద్వారా రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతోందన్నారు. రిజర్వాయర్ కిందనే ఉన్న జీడిపల్లి గ్రామానికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌పై ప్రభుత్వానికి పంపిన నివేదికలకు సంబంధించి రెవెన్యూ అధికారులతో ఆరాతీశారు.

రిజిష్టర్లు పక్కాగా ఉండాలి

తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి రిజిష్టరూ పక్కాగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. జీడిపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించిన అనంతరం బెళుగుప్ప తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ తరువాత తహసీల్దార్ కార్యాలయాల్లో సేవలపై మండలాలవారీగా పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హంద్రీ-నీవా ప్రాజెక్టు డీఈలు వెంకటేశ్వర్లు, విశ్వనాథరెడ్డి, జేఈ ఖలందర్, ఏఈఈలు షర్ఫుద్దీన్, ఎంపీడీఓ సుబ్బరాజు, డిప్యూటీ తహసీల్దార్ హుస్సేన్‌పీరా తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు అందుబాటులో ఉంచాలి

- వ్యవసాయ అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్, చిత్రంలో డీఏఓ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్: వేరుశనగ సాగులో అవసరమైన అంతరపంటల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వేరుశనగ విత్తనకాయల పంపిణీ, అంతర పంటల విత్తనాల కేటాయింపులు, పచ్చిరొట్ట పైర్ల విత్తనాల పంపిణీ అంశాలపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మతో కలిసి వ్యవసాయ శాస్త్రవేత్తలు, డివిజన్, మండల స్థాయి వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షించారు. వేరుశనగ విత్తనకాయ పంపిణీలో సమస్యలు ఏమైనా ఉన్నాయా అని క్షేత్రస్థాయి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున రైతులు ఇబ్బంది పడకుండా అవసరమైన విత్తనాలు, పచ్చిరొట్టి పైరు విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు వేరుశనగతో పాటుగా అంతర పంటల సాగు సంబంధించి రైతులతో మాట్లాడి వారికి అవసరమైన విత్తానాల వివరాలు తీసుకోవాలని చెప్పారు. దీనిపై వ్యవసాయశాఖ కమిషనర్‌కు నివేదిక పంపి వాటిని తెప్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో అంతర పంటల సాగుపై అధ్యయనం చేసి రైతులకు లాభదాయకమైన పంటలను శాస్త్రవేత్తల ద్వారా సిఫారసు చేయాలన్నారు. రైతు శిక్షణ కేంద్రం ద్వారా వ్యవసాయ శాఖ సిబ్బందికి, రైతులకు కొత్త అంశాలపై శిక్షణ ఇచ్చేలా షెడ్యూల్ రూపొందించాలని ఆదేశించారు.

కొత్త రకాలపై అవగాహన కల్పించాలి

జిల్లాలో ప్రధాన పంటగా ఉన్న వేరుశనగలో కొత్త రకాలను రైతులకు అందుబాటులో ఉంచడంతో పాటు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. కొత్త రకాల గురించి రేకులకుంట, కదిరి వ్యవసాయ పరిశోధన స్థానాల శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. కె-6 రకంతో పాటు గుజరాత్‌కు చెందిన గిరినార్-4, 5 రకాలు కూడా మంచి దిగుబడిని ఇస్తాయన్నారు. ఈ రకాలు సాగుచేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వేరుశనగ పంటలో యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలతో కలెక్టర్ చర్చించారు.



సమావేశానికి హాజరైన వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు

క్లుప్తంగా

ఉద్యానశాఖ డీడీగా ఫిరోజ్‌ఖాన్

- 40 రోజుల సెలవు పెట్టిన ప్రస్తుత డీడీహెచ్



అనంతపురం అగ్రికల్చర్: ఉద్యానశాఖ ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టర్ (డీడీహెచ్) బీఎంవీ నరసింహారావు 40 రోజుల పాటు సెలవు పెట్టారు. వ్యక్తిగత కారణాలతో ఈనెల 9వ తేదీ నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు సెలవు పెట్టినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ డీడీగా ఏపీఎంఐపీ ఏపీడీ జి.ఫిరోజ్‌ఖాన్‌ను నియమిస్తూ ఆ శాఖ కమిషనరేట్ నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిపారు. సోమవారం ఫిరోజ్‌ఖాన్ బాధ్యతలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం.

వైఎస్సార్‌సీపీ ఓటమి తట్టుకోలేక గుండెపోటుతో కార్యకర్త మృతి



లక్ష్మయ్య (ఫైల్)

శెట్టూరు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమిని జీర్ణించుకోలేక ఆ పార్టీ కార్యకర్త గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. చెర్లోపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త లక్ష్మయ్య(70) ఈ నెల 4న టీవీ ముందు కుర్చొని ఎన్నికల ఫలితాలు చూస్తున్నాడు. హఠాత్తుగా ఉన్న చోటే కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు వెంటనే లక్ష్మయ్యను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అనంతపురం ఆస్పత్రిలో శుక్రవారం మరణించాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య బాధిత కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు.

రైలు కిందపడి యువకుడి మృతి

కొత్తచెరువు: మండలంలోని నారాయణపురం రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు... బెంగళూరు నుంచి పుట్టపర్తికి వస్తున్న రైలు నుంచి యువకుడు ప్రమాదవశాత్తూ కిందపడి ఉండవచ్చన్నారు. రైల్వేపోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎలా చనిపోయాడో విచారణలో తెలుస్తుందని రైల్వేపోలీసులు తెలిపారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త !

- ఉమ్మడి అనంతలో జోరుగా వర్షాలు
- ఖరీఫ్ పనులకు సిద్ధమవుతున్న అన్నదాతలు
- విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో అప్రమత్తత అవసరమంటున్న వ్యవసాయాధికారులు
- కంపెనీల ప్రకటనలతో మోసపోవద్దని సూచన



ఖరీఫ్ పనుల్లో నిమగ్నమైన రైతన్నలు (ఫైల్)



షాపులో విత్తన నాణ్యతపై తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

రాయదుర్గం: నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు, చెక్‌డ్యాములకు జలకళ వస్తోంది. ఈ నేపథ్యంలోనే అన్నదాతలు వ్యవసాయంపై దృష్టిసారించారు. దుక్కులు దున్నడం, ఎరువులు చల్లడం లాంటి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. అన్ని అనుకూలిస్తే మరో 20 రోజుల్లోనే విత్తనం నాటే పనులు కూడా పూర్తవుతాయి. ఈ నేపథ్యంలోనే నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. లేకపోతే పంటతో పాటు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రధానంగా ఖరీఫ్‌లో వేరుశనగ, శనగ, కంది పంటలను ఎక్కువగా సాగు చేస్తారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ముందస్తుగా ప్రకటించింది. సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనాకు వచ్చింది. ప్రభుత్వం అందించే రాయితీ విత్తనానికి తోడు ప్రైవేటు షాపుల్లోనూ అనేక రకాల విత్తనాలను రైతులు కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో కొందరు వ్యాపారులు తక్కువ ధరలో ఎక్కువ దిగుబడులు వచ్చే విత్తన కంపెనీలు ఉన్నాయని, వాటిని కొనుగోలు చేసి తీసుకెళ్లేలా జోరుగా ప్రచారం చేస్తున్నారు. అయితే నకిలీ విత్తనాల బారిన పడి ఏటా రైతన్నలు అధిక సంఖ్యలో నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో కొనుగోలు సమయంలో అన్నదాతలు తగిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. దీనివల్ల నకిలీ విత్తనాలను ముందే గుర్తించొచ్చని, నష్టపోయినా పరిహారం పొందొచ్చని చెబుతున్నారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలిలా...

- వ్యవసాయశాఖ ద్వారా లైసెన్స్ పొందిన అధీకృత డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- బిల్లుపై విక్రయదారు పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, రైతు, గ్రామం పేరు, విక్రయదారు సంతకం తేదీలు, రకం పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు ఉన్నాయో లేదో సరి చూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనకూడదు.
- విత్తన ప్యాకెట్, సీసా, సంచి, డబ్బాలపై సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి.
- విత్తనాలు కొనుగోలుకు సంబంధించిన బిల్లును పంటకాలం పూర్తయ్యేవరకు భద్రపరుచుకోవాలి.
- మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలి.

ఎరువులు కొనే ముందు..

- అధీకృత డీలర్ల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి.
- మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులనే కొనాలి. ఒకవేళ చేతికుట్టు ఉంటే సీసం సీల్ ఉందో లేదో గమనించాలి.

అనంతపురం జిల్లాలో ఉన్న వ్యవసాయ భూమి	4,31,677 హెక్టార్లు
శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్న వ్యవసాయ భూమి	2,89,601 హెక్టార్లు
ప్రధాన పంటలు	వేరుశనగ, కంది, శనగ

- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి చేసిన సంస్థ, ఉత్పత్తిదారు పేరు ఉంటేనే కొనాలి.
- చిల్లులు పడిన, చిరిగిన ఎరువుల బస్తాలను కొనకూడదు. అన్య పదార్థాలు కలిస్తే ఆ ఎరువు కల్తీదిగా గుర్తించాలి.
- కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయాధికారిని సహకారంతో ఎరువులను పరీక్షించుకోవాలి.

పురుగు మందు కొనే ముందు...

- వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు శాస్త్రవేత్తల సూచనల మేరకే పురుగుల మందు కొనుగోలు చేయాలి.
- పురుగు మందు డబ్బాపై డైమాండ్ ఆకారంలో పురుగు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే ఎరుపు రంగు, విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులుంటాయి.
- పురుగు మందులు రెండు, మూడు రకాలు కలిపి వాడరాదు.
- వాడిన డబ్బాలు, సీసాలను ధ్వంసం చేసి గోతిలో పూడ్చిపెట్టాలి.
- పురుగు మందుల వాడకానికి వినియోగించిన పాత్రలను ఇతర అవసరాలకు ఉపయోగించకూడదు.

నాణ్యమైన విత్తనాలనే కొనాలి



నకిలీ విత్తనాలతో మోసపోతే వెంటనే వ్యవసాయాధికారులను సంప్రదించాలి. పోలీసులకు కూడా ఫిర్యాదు చేయొచ్చు. విత్తనాల్లో నాణ్యత లేక దిగుబడి కోల్పోయినట్లు గమనిస్తే సదరు విత్తన కంపెనీపై వ్యవసాయాధికారి ద్వారా జిల్లా అధికారికి ఫిర్యాదు చేయించి తగిన పరిహారం పొందవచ్చు. రైతులు సంబంధిత బిల్లులను భద్రంగా ఎత్తిపెట్టుకోవాలి. ఇటీవల అన్నీ దుకాణాల్లోనూ విస్తృతంగా తనిఖీలు చేపట్టాం. నాణ్యతలేని విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు చేపడతామని దుకాణదారులకు హెచ్చరికలు జారీచేశాం.

– లక్ష్మానాయక్, ఏడీఏ, రాయదుర్గం

నగదు, వెండి అపహరణ



ఇంట్లోని వస్తువులను చిందర వందరగా పడేసిన దొంగలు

తాడిపత్రి: రూరల్ పరిధిలోని కడప రోడ్డులో ఉన్న ఐశ్వర్య విల్లాస్‌లో నివాసం ఉంటున్న సుధాకర్ అనే వ్యక్తి ఇంటిలో గురువారం అర్ధరాత్రి దొంగతనం జరిగినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలమేరకు.. సుధాకర్ ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు చెప్పారు. కొద్దిరోజుల క్రితం బెంగుళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గుండెకు స్టంట్ వేయించుకుని, అక్కడనే చికిత్స తీసుకుంటున్నాడని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం సుధాకర్ ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో చుట్టుపక్కల ఇంటి వారు గమనించి ఇంటి యజమాని సుధాకర్‌తో పాటు వారి బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు రూరల్ పోలీసులకు సమాచారం అందించగా చోరీ జరిగిన ఇంటిని పరిశీలించినట్లు తెలియజేశారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇంట్లో రెండు కిలోల వెండి చోరీకి గురైనట్లు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కుటుంబ యజమాని రాగానే పూర్తి స్థాయిలో చోరీకి గురైన నగదుపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

మార్కెట్ యార్డు చైర్మన్ రాజీనామా



ఎస్‌వీఆర్ మోహన్

గుంతకల్లు: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌వీఆర్ మోహన్ శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది జనవరి 13న మార్కెట్ యార్డు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించానన్నారు. సీఎం వైఎస్ జగన్, మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి నేతృత్వంలో దాదాపు రూ.50 లక్షలతో మార్కెట్ యార్డులో నూతనంగా రైతు బజార్‌ను ఏర్పాటు చేశామన్నారు. యార్డు అభివృద్ధికి తన వంతు కృషి చేశానని గుర్తు చేశారు. దురదృష్టవశాత్తూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓడిపోవడంతో జీర్ణించుకోలేక తన పదవికి రాజీనామా చేసినట్లు చెప్పారు. రాజీనామా లేఖను అగ్రికల్చర్ మార్కెటింగ్ డైరెక్టర్‌కు పంపానన్నారు.

ఆశాజనకంగా మార్కెట్లు

- రెండు నెలల్లో రూ.2.07 కోట్ల వసూళ్లు



అనంతపురం అగ్రికల్చర్: ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా మార్కెటింగ్‌శాఖ పయనం ఆశాజనకంగా కనిపిస్తోంది. ప్రస్తుత 2024–25 ఏడాదికి 9 మార్కెట్ కమిటీలు, 15 వ్యవసాయ చెక్‌పోస్టుల ద్వారా రూ.12.24 కోట్లు లక్ష్యంగా దిశా నిర్దేశనం చేశారు. ఏప్రిల్, మే నెలలకు సంబంధించి వివిధ రకాల పన్ను వసూళ్లు బాగానే ఉన్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. మొదటి రెండు నెలల్లో 17 శాతం లక్ష్యసాధనతో రూ.2.07 కోట్లకు పైగా వసూళ్లు జరిగాయి. అందులో అత్యధికంగా అనంతపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ రూ.4.60 కోట్లకుగానూ తొలి రెండు నెలల్లోనే రూ.1.08 కోట్లకు పైగా సాధించడం విశేషం. ఆ తర్వాత ఉరవకొండ కమిటీ కూడా రూ.90 లక్షలకు గానూ 27 శాతంతో రూ.25 లక్షలు, కళ్యాణదుర్గం కమిటీ 22 శాతం వసూళ్లతో మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఆ తర్వాత 12 శాతంతో శింగనమల, 11 శాతంతో గుంతకల్లు, తాడిపత్రి మార్కెట్లు ఉన్నాయి. చివరి మూడు స్థానాల విషయానికి వస్తే అతి తక్కువగా కేవలం 5 శాతం వసూళ్లతో రాప్తాడు, 8 శాతం వసూళ్లతో రాయదుర్గం, గుత్తి మార్కెట్ కమిటీలు వెనుకబడ్డాయి. ఎన్నికల నేపథ్యంలో పర్యవేక్షణ కొరవడటం, సమన్వయం లేని కారణంగా కొన్ని మార్కెట్లలో పన్ను వసూళ్లు తగ్గినట్లు చెబుతున్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం

- ఏపీఎస్‌ఆర్‌టీసీ కడప ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు



ప్రతిభ కనబరిచిన ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న వెంకటేశ్వరరావు

రాయదుర్గంటౌన్: ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యంగా ఉద్యోగులు పని చేయాలని ఏపీఎస్ ఆర్టీసీ కడప ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం ఆయన రాయదుర్గం డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయనతో పాటు ఆర్‌ఎం సుమంత్ ఆదోని, స్థానిక డీఎం సురేష్‌కుమార్ ఉన్నారు. తొలుత వెంకటేశ్వరరావు డిపోలోని గ్యారేజీ, డిపో మేనేజర్ కార్యాలయం, కార్గో విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి ఉద్యోగి ప్రజారవాణశాఖ ఆదాయం పెంపునకు కృషి చేయాలన్నారు. బస్సుల మైలేజీని పెంచి డీజిల్ వినియోగం తగ్గించేలా కృషి చేయాలన్నారు. అనంతరం గ్యారేజీలో బస్సు కండిషన్లపై ఉద్యోగులతో మాట్లాడారు. సమయ పాలన పాటించి ప్రయాణికుల మన్నన పొందాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అంతకు ముందు డిపో గ్యారేజీ ఆవరణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

మోడల్ స్కూళ్లలో సీట్లు భర్తీ చేయాలి



మాట్లాడుతున్న డీఈఓ వరలక్ష్మి

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని 15 మోడల్ స్కూళ్లలోనూ 2024–25 విద్యా సంవత్సరంలో వివిధ తరగతుల సీట్ల భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కేఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో అడ్మిషన్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. పాఠశాలల పరిసరాలను శుభ్రం చేయించాలన్నారు. తరగతులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ దేవి

అనంతపురం మెడికల్: జిల్లాలో మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి వెల్లడించారు. మలేరియా నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తన కార్యాలయంలో జిల్లాస్థాయి ప్రణాళికా కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా పడటంతో మలేరియాకు కారణమైన దోమలు పెరుగుదలను అరికట్టేందుకు వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ రాజ్, మునిసిపల్, విద్యాశాఖ, మైన్స్, మత్స్యశాఖలతో సమన్వయం చేసుకుంటామన్నారు. నీటి నిలువలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఫీవర్ సర్వేతో పాటు జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరి రక్తపూతలు సేకరించి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు డీసీహెచ్‌ఎస్ పాల్ రవికుమార్, ఆస్పత్రి వైద్యులు భీమసేనాచారి, జిల్లా మలేరియా అధికారి ఓబులు, ప్రోగ్రాం అధికారులు సుజాత, రవిశంకర్, ఎంపీహెచ్‌ఓ గిరిధర్‌రెడ్డి, డెమో ఉమాపతి, ఉప డెమో త్యాగరాజ్, గంగాధర్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి



వార్డెన్లతో మాట్లాడుతున్న జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజనేయులు

అనంతపురం రూరల్: 'వేసవి సెలవులు అనంతరం వసతి గృహాలు తిరిగి పునఃప్రారంభం అవుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రభుత్వ వసతి గృహాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించేలా వార్డెన్లు పనిచేయాలి' అని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజనేయులు ఆదేశించారు. శుక్రవారం గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయడంతో పాటు వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమయ్యే నాటికి వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వార్డెన్లు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డెన్లు అనసూయ, రవి ప్రతాప్, అనురాధ, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో రణరంగం సృష్టించిన టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ మాధవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం రామగిరి మండలం సుద్దకుంటపల్లి తండాలో టీడీపీ అభ్యర్థి గెలవడంతో ఆపార్టీకి చెందిన కొందరు కార్యకర్తలు వేట కొడవళ్లతో రణరంగం సృష్టించారు. ప్రత్యర్థులను భయాందోళనకు గురిచేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది. అలాగే కొన్ని పత్రికల్లో ప్రచురితమైంది. ఈనేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు విచారణ జరపడంతో ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లు విచారణలో తేలింది. కేసు కూడా నమోదు చేశారు. కౌంటింగ్ అనంతరం జిల్లా వ్యాప్తంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు అన్ని భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలియజేశారు.

బంగారు గొలుసు అపహరణ

గుత్తి: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో శుక్రవారం రంగస్వామి అనే వ్యక్తికి చెందిన మూడు తులాల బంగారు గొలుసు అపహరణకు గురైంది. వివరాల్లోకి వెళితే... పెద్దొడ్డి గ్రామానికి చెందిన రంగస్వామి వ్యవసాయ పెట్టుబడుల కోసం బంగారు చైన్‌ను బ్యాంకులో పెట్టి రుణం తీసుకోవడానికి గుత్తికి వచ్చాడు. అయితే గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ ఆర్‌అండ్‌బీలో ఉన్నాడని తెలుసుకుని ఆయన్ను కలిసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో గుంపులో ఎవరో బంగారు చైన్ కొట్టేశారు. ఈ విషయాన్ని బాధితుడు గుమ్మనూరు నారాయణకు తెలియజేశాడు. దీంతో గుమ్మనూరు నారాయణ ఎవరికైనా బంగారు చైన్ దొరికి ఉంటే బాధితుడు రంగస్వామికి ఇవ్వాలని మైక్‌లో అనౌన్స్ చేశాడు. ఈ విషయంపై బాధితుడు రంగస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

30 మంది విద్యార్థులు ఆస్పత్రిపాలు

- వైరల్ ఫీవర్, వాంతులు, విరేచనాలకు చికిత్స



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డులోని మహమ్మదీయ అరబిక్ కళాశాలకు చెందిన దాదాపు 30 మంది విద్యార్థులు వైరల్ ఫీవర్, వాంతులు, విరేచనాలతో శుక్రవారం రాత్రి ఆస్పత్రిపాలయ్యారు. స్థానిక ఏరియా ఆస్పత్రికి కళాశాల ప్రిన్సిపాల్ అస్రఫ్‌ఫైజీ, సెక్రటరీ అమీర్ హమ్జ, కళాశాల మౌలానాలు విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు. డ్యూటీ వైద్యురాలు ప్రతిభ ఆధ్వర్యంలో వారికి చికిత్స అందించారు. ఈ ఘటనపై కళాశాల నిర్వాహకులు మాట్లాడుతూ కొందరు విద్యార్థులు వర్షంలో తడవడంతో సమస్య వచ్చిందన్నారు. ఈ విషయమై వైద్యురాలు మాట్లాడుతూ అనేక మంది పిల్లలకు వైరల్ ఫీవర్ ఉందని, కొందరికి వాంతులు, విరేచనాలు అయినట్లు చెప్పారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం లేదని, చికిత్సలు అందిస్తున్నట్లు వివరించారు.





సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డు యూనిట్ - 1, యూనిట్ - 3లో చిన్నారులను ఆకట్టుకునేలా గోడలకు బొమ్మలు వేసిన దృశ్యం

ఆకట్టుకునేలా చిన్నపిల్లల వార్డు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చిన్న పిల్లల వార్డును కార్పొరేట్ ఆస్పత్రిని తలదన్నేలా ఏర్పాటు చేసింది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఎంతో అందంగా చిన్నపిల్లల వార్డును తీర్చిదిద్దారు. చికిత్స నిమిత్తం పిల్లలతో కలిసి వచ్చిన తల్లిదండ్రులు ఇక్కడున్న వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలను చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారు. విభాగంలో వివిధ యూనిట్లతో పాటు వార్డు ఆవరణలోనూ అందమైన రంగుల బొమ్మలు కన్పిస్తాయి. చిన్నారులు కూడా మారాం చేయకుండా వైద్యం పొందుతున్నారు.



వార్డు ఆవరణలో ఇలా...

క్లుప్తంగా

ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గత నెల 15వ తేదీన వేసవి శిక్షణ శిబిరాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి నల్లమ్మ మాట్లాడుతూ.. ఈ శిక్షణ శిబిరాల్లో పిల్లలకు పఠనశక్తి ఎలా పెంచుకోవాలో వివరించడం జరిగిందన్నారు. విద్యార్థులు గ్రంథాలయానికి రావడం అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయంలో అనేక పుస్తకాలు ఉంటాయని తెలిపారు. పుస్తకాలను చదవడం వల్ల జ్ఞానం పెరుగుతుందన్నారు. అనంతరం ఆటలు, క్విజ్ పోటీలు, చదువు, పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది అర్లపరెడ్డి, చందన, అనీల్ సరళ, వన్నూర్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

బాట మారెమ్మకు పూజలు



అలంకరణలో బాట మారెమ్మ దేవత

కనగానపల్లి: మండల కేంద్రానికి సమీపంలో ప్రధాన రహదారి పక్కన వెలసిన బాట మారెమ్మ దేవతకు శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలు తరలివచ్చి పూజలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా భక్తులు అమ్మవారిని పూలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సబ్సిడీపై కంది విత్తనాలు

ఆత్మకూరు: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసేందుకు సబ్సిడీపై రైతులకు కంది విత్తనాలు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి సుచరిత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో కంది విత్తనాలు రకం (ఎల్ఆర్‌జీ-52) కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. నాలుగు కిలోల కంది విత్తనాల ప్యాకెట్ ధర రూ.559 కాగా.. సబ్సిడీ రూ.167 పోనూ రైతు రూ.392 చెల్లించాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

రామగిరి: మండలంలోని నసనకోట సమీపంలో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయాన్నే అమ్మవారిని వివిధ రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉమ్మడి జిల్లావాసులే కాక కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అదే విధంగా ఆలయంలో ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

కారులో కర్ణాటక మద్యం



ప్రమాదానికి కారణమైన కారులో లభించిన కర్ణాటక మద్యం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని కోటంపల్లి ప్రాథమిక పాఠశాల సమీపంలో గురువారం రాత్రి ఓ కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదానికి కారణమైన కారును వదిలి డ్రైవర్ పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో వెంకటంపల్లికి చెందిన రమణారెడ్డి కాలికి తీవ్ర గాయమైయింది. గాయపడిన వ్యక్తిని మరో వాహనంలో చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న చెన్నేకొత్తపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కారును పరిశీలించారు. అందులో కర్ణాటకు చెందిన 750 మద్యం ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. పారిపోయిన వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

రేపు మౌనగిరి క్షేత్రంలో ప్రత్యేక పూజలు

రాప్తాడు: మండలంలోని హంపాపురం సమీపంలో ఉన్న మౌనగిరి క్షేత్రంలో వెలసిన 39 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేయనున్నట్లు నిర్వాహకుడు ఈశ్వరయ్య స్వామి తెలిపారు.



అనంతపురంలో కురుస్తున్న వర్షం



వర్షంలో చిన్నారిని ఎత్తుకుని వెళ్తున్న దృశ్యం



రోడ్డుపై నిలిచిన నీటిలో ఇలా..



తోపుడు బండిని తోసుకుంటూ వెళ్తున్న వృద్ధురాలు

• జోరువాన

వరుణుడు తెరిపివ్వడం లేదు. విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం నగరంలో జోరువాన కురిసింది. ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. చల్లనిగాలులు వీచాయి. బయటకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇక సాయంత్రం నుంచి రాత్రి వరకూ వర్షం కురిసింది. పలుచోట్ల రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



వర్షంలో తడుచుకుంటూ వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్..



కనగానపల్లి ఎంఈఓ కార్యాలయంలో భద్రపరిచిన పాఠ్య పుస్తకాలు

కనగానపల్లి: జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం అయ్యే నాటికి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు సరఫరా చేస్తామని ఎంఈఓ అరుణమ్మ తెలిపారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 2024–25 విద్యా సంవత్సరంలో మొదటి సెమిస్టర్‌కు సంబంధించిన పాఠ్యపుస్తకాలు 75 శాతం దాకా వచ్చాయన్నారు. వీటిలో 1 నుంచి 7వ తరగతి వరకు 6,265 పుస్తకాలు, 8 నుంచి 10వ తరగతులకు సంబంధించి 10,298 పుస్తకాలు సరఫరా చేశారన్నారు. ఇంకా 6,950 పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. వీటితో పాటు విద్యార్థులకు అందించే విద్యా కానుక కిట్లు కూడా ఒక్కొక్కటి ఎంఈఓ కార్యాలయానికి చేరుతున్నట్లు తెలిపారు. పాఠశాలలు పునః ప్రారంభం కాగానే వీటన్నింటిని మండలంలోని 49 ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసి విద్యార్థులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 శ్రీదేవి, ఎంఐఎస్ రామన్న, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్ఓ సేవలు అమూల్యం



వీఆర్ఓ యాదవల్లి సుబ్రహ్మణ్యం దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

రాప్తాడు: రెవెన్యూ శాఖలో వీఆర్ఓ యాదవల్లి సుబ్రహ్మణ్యం రైతులు, ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని తహసీల్దార్ తిమ్మరాజుల సీతారామ్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని గొందిరెడ్డిపల్లి వీఆర్ఓ యాదవల్లి సుబ్రహ్మణ్యం ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ.. సంపూర్ణ ఆరోగ్యంతో ఉద్యోగ విరమణ పొందడం దేవుడిచ్చిన వరం అన్నారు. వీఆర్ఓగా యాదవల్లి సుబ్రహ్మణ్యం రాప్తాడు మండలంలో 20 ఏళ్లకు పైగా ప్రజలు, రైతులకు ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. అలాగే ఇతర శాఖల అధికారులతో అందరినీ సమన్వయం చేసుకుంటూ అంకితభావంతో విధులు నిర్వర్తించారన్నారు. ఎల్లప్పుడు రైతుల సమస్యలు పరిష్కరిస్తూ మంచి ఫలితాలు సాధించారన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించడంలో ముందుండేవారన్నారు. సుదీర్ఘకాలం రెవెన్యూ శాఖలో సేవలందించి ఈ రోజు విశ్రాంత జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన యాదవల్లి సుబ్రమణ్యంతో పాటు ఆయన సతీమణిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్లు మాధవ రెడ్డి, మధుసూదన్ రావు, రెవెన్యూ సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు

• అధికారులకు మేయర్ వసీం ఆదేశం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా పైప్‌లైన్ లీకేజీలను ఎప్పటికప్పుడు రిపేరీ చేయాలి. ముద్దలాపురం ఫిల్టేషన్ పాయింట్‌లో నీటిని సక్రమంగా శుద్ధి చేసే ప్రక్రియను పరిశీలించి, నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యలతో కలసి వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ.. ఫిల్టేషన్ పాయింట్‌లో మోటర్ల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూసుకోవాలన్నారు. టెండర్ పూర్తీ అయినా.. వీధి లైట్ల ఏర్పాటు జరగలేదని వాటి పనులను వేగవంతం చేయాలన్నారు. పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. చెత్త సేకరణ పక్కాగా జరిగేలా చూడాలన్నారు. నగర పాలక సంస్థ పారిశుధ్య కార్యదర్శులు జాబ్‌చార్ట్ ప్రకారం విధులు సక్రమంగా నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జేసీబీలు, తదితర వాహనాలకు ఎప్పటికప్పుడు రిపేరీ చేయించాలన్నారు. వర్షాకాలంలో దోమకాటు వ్యాధులు అధికమయ్యే పరిస్థితి లేకపోలేదన్నారు. దోమకాటు నివారణ చర్యల్లో భాగంగా ఫాగింగ్, స్ప్రేయింగ్ క్రమం తప్పకుండా చేయించాలని ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులు త్వరితగతిన చెల్లించేలా చూడాలని ఎగ్జామినర్‌ను ఆదేశించారు. ఎప్పటికప్పుడు సీఎఫ్ఎంస్‌కు బిల్లులను పంపాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయించాలని ఈఈ సూర్యనారాయణను మేయర్ ఆదేశించారు. చెత్త నిర్వహణ పక్కాగా జరిగేందుకు 200 డంపర్ బిన్స్‌ను తక్షణం కొనుగోలు చేయాలని డిప్యూటి మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. నగర జనాభాకు అనుగుణంగా మరో 70 మంది కార్మికులను తీసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. అందుకు ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాలన్నారు. అదేవిధంగా వర్షాకాలంలో చెట్లు కొమ్మలు తొలగించడానికి, లైట్లు ఏర్పాటు చేయడానికి ల్యాడర్‌ను రిపేరీ చేయించాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు అబూసలేహ, శ్రీనివాసులు, అనిల్‌కుమార్ రెడ్డి, సైఫుల్లా బేగ్, అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, ఈఈ సుధారాణి, డీఈలు చంద్రశేఖర్, రవీంద్ర రెడ్డి, దాక్షాయని, తదితరులు పాల్గొన్నారు.

ఆముదం సాగు లాభదాయకం

బుక్కరాయసముద్రం: ఆముదం పంట సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఐఐఓఆర్ పర్యవేక్షణలో ఉరవకొండకు చెందిన రాయలసీమ అగ్రి ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ నూతనంగా అభివృద్ధి చేయబడిన ఐసీహెచ్-5 ఆముదం రకం నూతన వంగడాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఆయనతోపాటు, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరి హాజరయ్యారు. వారు మాట్లాడారు. కరువు జిల్లాకు వరప్రదాయిని ఐసీహెచ్-5 ఆముదం రకం అన్నారు. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా తట్టుకు అధిక దిగుబడులు ఇవ్వడం ద్వారా రైతులకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మంజునాథ్, పవన్‌కుమార్‌రెడ్డి, రాయలసీమ అగ్రి ప్రొడ్యూసర్ కమిటీ లిమిటెడ్ సీఈఓ శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్లు యోగీశ్వరరెడ్డి, కె. శ్రీధర్‌రెడ్డి, ఆదర్శరైతు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

అనంతపురం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్‌కు ఆయా సంఘాల నాయకులు విన్నవించారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించారని కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్ కుమార్‌ను ఏపీఎస్ఈఓ, ఆపస్, ఎస్ఎల్‌టీఏ, డీటీడబ్ల్యూఏ నాయకులు కలిశారు. సిబ్బంది, అధికారులు స్నేహపూరిత వాతావరణంలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేలా చొరవ చూపారంటూ ప్రశంసించారు. అదే క్రమంలో కలెక్టర్ దృష్టికి సమస్యలను నాయకులు తీసుకొచ్చారు. ఎన్నికల సమయంలో వివిధ కారణాలతో సస్పెండ్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. బూత్ లెవల్ అధికారులకు గౌరవ వేతనం చెల్లించాలని కోరారు. ఎన్నికల రెమ్యునరేషన్‌లో అసమానతలు తొలగించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ ఎంప్లాయిల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్, ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, రాష్ట్ర కార్యదర్శి రాజేంద్రప్రసాద్, ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు ఆదిశేషయ్య, డీటీడబ్ల్యూఏ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు నాగరాజు, జోషికుమార్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

నేడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

రాప్తాడు: అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల్లోని జన్మభూమి నగర్, కక్కలపల్లి, కాటిగాని కాల్వ, బుక్కచెర్ల, జి.కొత్తపల్లి, గాండ్లపర్తి, వరిమడుగు, పాలచెర్ల, భోగినేపల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లోని భారత్ గ్యాస్ వినియోగదారులకు శనివారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. ఈనెల 7వ తేదీ వరకూ ఇండేన్ గ్యాస్‌ను బుక్ చేసుకున్న వారికి పాత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వంట గ్యాస్ సిలిండర్లను అందజేయనున్నారు. మరింత సమాచారం కోసం 08554-286777 (భారత్ గ్యాస్), 08554 246199 (హసిని ఇండేన్ పవన్ గ్యాస్), 08554-228789 (హనుమాన్ హెచ్‌పీ గ్యాస్) నంబర్లకు సంప్రదించవచ్చు.

కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా డాక్టర్ లోకేశ్వర్లు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా డాక్టర్ లోకేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వరకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా శ్రీరాములు నాయక్ ఉన్నారు. క్యాంపస్ కళాశాల ఎడ్యుకేషన్ కళాశాలలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న లోకేశ్వర్లును కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా నియమించారు.

‘మహనీయుల విగ్రహాలు తొలగించొద్దు’

అనంతపురం టవర్‌క్లాక్: పార్లమెంట్‌లో మహనీయుల విగ్రహాలు తొలగించడం దారుణమని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకే హరి అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యలయం ఎదురుగా వున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో గెలవడంతో ఇంకా ప్రభుత్వం ఏర్పాటు కాకనే పార్లమెంట్‌లో మహనీయుల విగ్రహాలు తొలగించడం సరైంది కాదన్నారు. తక్షణమే మహనీయుల విగ్రహాలు యథావిధిగా అదే స్థానంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బడుగు, బలహీన వర్గాలు, దళిత, గిరిజనులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులను తక్షణమే ఆపాలన్నారు. కంబదూరు మండలం తిప్పేపల్లికి చేందిన దళితులపై దాడులు జరిగాయని గుర్తు చేశారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వెంకట్రాముడు, రామకృష్ణ, అజయ్, నాగేంద్ర, ఈశ్వరయ్య, మల్లికార్జున, పెద్దన్న, ఓబులేసు, నరసిహులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ‘నొళంబవాడి’ పుస్తక పరిచయ సభ

అనంతపురం కల్చరల్: జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 9న ఉదయం 10 గంటలకు స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో సిద్దగిరి శ్రీనివాస్ రచించిన నొళంబవాడి పుస్తక పరిచయ సభ నిర్వహిస్తున్నట్లు జిరసం అధ్యక్షుడు డాక్టర్ జెన్నే ఆనంద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక మహా సామంత రాజ్యపు చరిత్రను కళ్లకు కట్టినట్టు వివరించే సభకు సాహితీమిత్రులందరూ విచ్చేయాలని కోరారు.

రేపు ‘రైతే మా రాజు’ పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: ఏపీ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన మార్తాటీ ఈశ్వరీ గోపాలరావు రచించిన ‘రైతే మా రాజు’ పుస్తకావిష్కరణ ఉంటుందని అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి నానీల నాగేంద్ర, జనప్రియ కవి ఏలూరు యంగన్న శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్జీఓ హోమ్‌లో జరిగే కార్యక్రమానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డితో పాటూ పలువురు సీనియర్ కవులు రచయితలు హాజరవుతారన్నారు. సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

స్వల్పకాలిక కోర్సులతో ఉపాధి అవకాశాలు

అనంతపురం ఎడ్యుకేషన్: పీఎంకేవీవై రూపొందించిన స్వల్పకాలిక కోర్సులతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఇనిస్టిట్యూట్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఐఎంసీ) కమిటీ సభ్యుడు శేషాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో స్వల్పకాలిక కోర్సులు పూర్తి చేసుకున్న వారికి శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. శేషాంజనేయులు మాట్లాడుతూ.. సాధారణ డిగ్రీలతో పాటు స్వల్పకాలిక కోర్సుల ద్వారా వచ్చే సర్టిఫికెట్లను అదనపు అర్హతగా భావిస్తారన్నారు. తద్వారా పారిశ్రామిక రంగం, సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలు లభిస్తాయని తెలిపారు. మార్కెట్‌కు అనుగుణంగా అవసరమయ్యే కోర్సులను ఎంపిక చేసుకుని జీవితానికి మెరుగులు దిద్దుకోవాలన్నారు. మరో సభ్యుడు నీలకంఠారెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఉత్పత్తి రంగానికి మంచి డిమాండ్ ఉంటుందన్నారు. అందుకు తగిన నాణ్యత, నైపుణ్యాలను సొంతం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి మాట్లాడుతూ.. పీఎంకేవీవై కింద ఇప్పటిదాకా 210 మంది అభ్యర్థులకు స్వల్పకాలిక కోర్సుల్లో అవకాశం కల్పించామన్నారు. ప్రస్తుతం 64 మందికి సర్టిఫికెట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధి జగన్, ట్రెనింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, కోర్సు కో-ఆర్డినేటర్ అపర్ణ పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

ఎప్పుడు వస్తారో..ఏంటో..!

ఆత్మకూరు: మండలంలోని పలు సచివాలయాలు, ఆర్బీకేల సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తున్నారు. ఎన్నికల సందడి ముగిసినా సచివాలయాలతో పాటు, రైతు భరోసా కేంద్రాలను సమయానికి తెరవడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాల వద్దకు వస్తున్నారు. అయితే సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో గంటల తరబడి వేచి చూస్తున్నారు. విత్తనాల కోసం ఎద్దుల బండ్లు, ఆటోలు వేసుకుని వచ్చి సచివాలయ సిబ్బంది కోసం నిరీక్షిస్తున్నారు. సచివాలయ సిబ్బంది మాత్రం ఉదయం 10:30 గంటలు దాటినా విధులకు హాజరుకావడం లేదు. మండల స్థాయి అధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుచున్నారు.



పంపనూరులో ఉదయం 10:30 గంటల సమయంలో కార్యాలయం వద్ద వేచి ఉన్న రైతులు

రేణుకా యల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

అనంతపురం కల్చరల్: నగరంలోని జీసెస్ నగర్‌లో వెలసిన రేణుకా యల్లమ్మ తల్లి ఆలయ 25వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటూ ఘనంగా సాగే వేడుకల్లో భాగంగా తొలి రోజు గణపతి, నవగ్రహ పూజలు, సామూహిక లలితా కుంకుమార్చన, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. వార్షికోత్సవ వేడుకలను ఈసారి మరింత ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా శనివారం 108 దుర్గాసూక్తములతో అభిషేకం, చండీ రుద్ర హోమాలు, ఆదివారం ఆలయ వార్షికోత్సవ ముగింపు వేడుకల నేపథ్యంలో 108 శ్రీసూక్తములతో అభిషేకం, మహాపూర్ణాహుతి, మహా అన్నదాన కార్యక్రమం, సాయంత్రం గ్రామోత్సవం జరుగుతాయని తెలపిరాఉ. భక్తులందరూ పాల్గొని తీర్థప్రసాదాలందుకోవాలని కోరారు.

నేడు చిన్న కదిరయ్య స్వామి ఆలయంలో పూజలు

రాప్తాడు: మండలంలోని మరూరులో వెలసిన చిన్నకదిరయ్య స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తాదులకు అన్నసంతర్పణ చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.